సాక్షి
అనంతపురం
బుధవారం । 10 । జులై । 2024



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.36

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.36 పలికింది. కనిష్టం రూ. 26, సరాసరి రూ. 30 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.5°/24.8°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలిక పాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో



తుంగభద్ర జలాశయంలో చేరిన నీరు

బొమ్మనహాళ్: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గింది. ఆదివారం 50,715 క్యూసెక్కులు, సోమవారం 30,388 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో మంగళవారం ఉదయానికి 23,079 క్యూసెక్కులకు పడిపోయింది. 105.788 టీఎంసీల పూర్తి మట్టానికి గాను డ్యాంలో 22.825 టీఎంసీల వరకు నీరు నిల్వ అయ్యాయి.అవుట్ ఫ్లో 156 క్యూసెక్కులుగా నమోదవుతోంది. 1,633 అడుగుల ఎత్తున్న డ్యాంలో ప్రస్తుతం 1,600.99 అడుగుల వరకు నీరు చేరాయి. మరికొన్ని రోజుల పాటు డ్యాంలోకి వరద నీరు భారీగా వచ్చే అవకాశం ఉంది.

మాజీ ఎమ్మెల్యే సిద్దారెడ్డిపై సస్పెన్షన్ వేటు



డా.పీవీ సిద్దారెడ్డి

కదిరి: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పని చేసిన కదిరి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. సిద్దారెడ్డి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పార్టీ క్రమశిక్షణ కమిటీకి అనేక ఫిర్యాదులు అందాయి. సమగ్ర విచారణ జరిపిన అనంతరం పార్టీ క్రమశిక్షణ కమిటీ సిఫారసుల మేరకు పార్టీ అధినేత వైఎస్ జగన్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

కొలువుదీరిన కాశీంస్వామి



బత్తలపల్లి: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన బత్తలపల్లి కాశీంస్వామి కొలువు దీరారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో గూగూడు తర్వాత అంతటి స్థాయిలో ఇక్కడ మొహర్రం వేడుకలు జరుగుతాయి. సోమవారం రాత్రి ముజావర్లు జిలానీ, టైలర్ రియాజ్, మహబూబ్ బాషా, నజరుల్లా, కాశీంవలీలు చావిడిలో ఫాతెహా చేసి అర్ధరాత్రి కాశీంస్వామిని కొలువుదీర్చారు. మంగళవారం నిత్యపూజలు నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని గంటాపురం, ముష్టూరు, మాల్యవంతం, రాఘవంపల్లి, యర్రాయపల్లి, లింగారెడ్డిపల్లి, అనంతసాగరం, వెంకటగారిపల్లి గ్రామాల్లోనూ మొహర్రం వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గ్రామాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

పింఛన్లు నిలిపేస్తారా?

- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం
- సామాజిక పింఛన్ల పంపిణీలో కోతపై నిలదీత
- డిప్యూటీ సీఈఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈని సరెండర్ చేయాలని పట్టు
- నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్



పింఛన్లు తొలిగించారంటూ ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్పీటీసీ సభ్యులు

అనంతపురం సిటీ: ఐదేళ్లుగా తీసుకుంటున్న పింఛన్లను కొత్త ప్రభుత్వం ఎలా నిలిపేస్తుందని జెడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యులు నిలదీశారు. ఇప్పటికీ చాలా మంది అర్హులకు పింఛన్లు అందలేదని మండిపడ్డారు. మంగళవారం అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని అనంతపురం, హిందూపురం ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు జేసీ అస్మిత్‌రెడ్డి, బండారు శ్రావణీశ్రీ, పల్లె సింధూరారెడ్డి, దగ్గుపాటి వెంకటప్రసాద్, ఎంఎస్ రాజు, కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, కందికుంట వెంకటప్రసాద్, గుమ్మనూరు జయరాం హాజరయ్యారు. అనంతపురం కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, సీఈఓ వైఖోమ్ నిదియాదేవి పాల్గొన్నారు. తొలుత ఎంపీలు, ఎమ్మెల్యేలకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ నిదియా, డిప్యూటీ సీఈఓ లలితబాయి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇటీవల గుండెపోటుతో మరణించిన పెనుకొండ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరాములు మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

పింఛన్ల నిలిపివేతపై ఆగ్రహం..

చైర్‌పర్సన్ గిరిజమ్మ సభను ప్రారంభించగా.. టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీ సభ్యులు కొత్త ప్రభుత్వం సామాజిక పింఛన్ల మొత్తాన్ని పెంచడంపై ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేయాలని కోరారు. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీ సభ్యులు జోక్యం చేసుకుంటూ ఇంకా చాలా మంది అర్హులకు పింఛన్లు అందలేదని తెలిపారు. చాలా రోజులుగా పింఛన్ అందుకుంటున్న వారికి ఒక్కసారిగా నిలిపివేయడంతో ఆందోళన చెందుతున్నారన్నారు. ఎంపీ బీకే కల్పించుకుంటూ 75 శాతం మందికి పింఛన్లు అందించామన్నారు. పింఛన్ల పంపిణీలో లోపాలుంటే పరిశీలించి సరిదిద్దుతామని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ ప్రకటించారు. అర్హులకు అన్యాయం జరగనివ్వబోమని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ జెడ్పీ డిప్యూటీ సీఈఓ లలితబాయి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్‌బాషాను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని గత జెడ్పీ సమావేశాల్లో చేసిన తీర్మానాలకు ఇంత వరకు దిక్కులేకపోగా, ఆ తీర్మాన కాపీలను అధికారులు మాయం చేశారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీకి చెందిన దళిత జెడ్పీటీసీ సభ్యుడిని డిప్యూటీ సీఈఓ లలితబాయి అవమానించారని, ఆమెపై చర్యలు తీసుకోవాలని సభ్యులంతా పట్టుబట్టారు. సీఈఓ సైతం జెడ్పీటీసీలను చిన్నచూపు చూస్తున్నారని సభ్యులు ఆరోపించారు. ఈ అంశంపై ఎంపీలు, ఎమ్మెల్యేలు కల్పించుకుంటూ ప్రజాప్రతినిధులు ఏ పార్టీ వారైనా, ఏ స్థాయి వారైనా గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఉందన్నారు. అవమానకరంగా మాట్లాడిన వారిని క్షమించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. కలెక్టర్ వినోద్ కుమార్ జోక్యం చేసుకొని ఈ అంశంపై విచారణ చేయించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ తీరుపై మండిపాటు

ఆర్‌డబ్ల్యూఎస్ అంశంపై చర్చ ప్రారంభం కాగానే.. జల్ జీవన్ స్కీం కింద ఎన్ని కోట్లు వచ్చాయి, పనులు ఎంత వరకు సాగాయి, ఇంకా నిధులు ఎన్ని ఉన్నాయని ఎంపీ బీకే, ఇతర సభ్యులు ప్రశ్నించారు. ఎస్ఈ ఎహసాన్ బాషా పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో సభ్యులు మండిపడ్డారు. ఏంటి తమాషాగా ఉందా..ఎందుకు నవ్వుతున్నారంటూ జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అసహనం వ్యక్తం చేశారు. జెడ్పీ నిధులు రూ.కోట్లకు కోట్లు ఏ విధంగా కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని నిలదీశారు. శ్రీసత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికుల ప్రయోజనాలను కూడా స్వాహా చేశారన్నారు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కూడా డొంక తిరుగుడు సమాధానాలివ్వడంపై అధికార, విపక్ష సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టండి

ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా నకిలీ విత్తనాలు, ఎరువులు విపరీతంగా మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయని, వాటిని అరికట్టాలని గుంతకల్లు జెడ్పీటీసీ సభ్యుడు కురుబ కదిరప్ప కోరారు. బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న దృష్ట్యా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి తమకు ఇస్తే అసెంబ్లీలో చర్చిస్తామని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు.దీనిపై కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందిస్తూ.. 42 అంశాలతో నివేదిక రూపొందించామన్నారు. ఈ నెల 11న అధికారులతో చర్చించి, నివేదిక సిద్ధం చేస్తామని శ్రీసత్యసాయి జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ వివరించారు. నకిలీ విత్తనాల ఏరివేతకు ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపినట్లు కలెక్టర్ వెల్లడించారు.

వైద్య ఆరోగ్య శాఖపై చర్చ

వైద్య ఆరోగ్య శాఖపై చర్చ సందర్భంగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీ సభ్యులు తమ ప్రాంత సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. కుక్కకాటుకు, పాముకాటుకు ఆస్పత్రుల్లో మందుల్లేవని ఎమ్మెల్యే సింధూరారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువయ్యాయని, క్షతగాత్రులను అనంతపురం పెద్దాస్పత్రికి తీసుకువస్తే కర్నూలు లేదా బెంగళూరుకు రెఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్ ఆరోపించారు. సర్వజనాస్పత్రిలో ఒకే బెడ్‌పై 8, 10 మందిని పడుకోబెడుతున్నారని, ఆ సమస్యపై దృష్టి పెట్టాలని కోరారు. పెద్దాస్పత్రిలో పని చేసే కొందరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు డ్యూటీలకు డుమ్మాకొట్టి, మహిళలు, అమ్మాయిల వెంటబడుతున్నారని, వారి ఆగడాలకు క్లెం వేయాలని ఆయన డిమాండ్ చేశారు.



ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ప్రజా సంక్షేమానికి కలసికట్టుగా కృషి చేద్దాం

ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇచ్చే సలహాలు, సూచనలు తీసుకొని ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కలసికట్టుగా కృషి చేస్తాం. త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు రూ.200 కోట్లు కేటాయించేలా ఎమ్మెల్యేలు తమవంతు కృషి చేయాలి. అధికార, ప్రతిపక్ష పార్టీలనే తేడా లేకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి చిత్తశుద్ధితో పని చేద్దాం. అవినీతి అధికారులను జిల్లా నుంచి పంపిద్దాం.

– బోయ గిరిజమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

ప్రజాప్రతినిధులను గౌరవించాల్సిందే

ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులను ఏ స్థాయి అధికారైనా గౌరవించాల్సిందే. ఈ విషయంపై అన్ని శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి గట్టిగా చెబుతా. దళిత జెడ్పీటీసీ సభ్యుడికి జరిగిన అవమానంపై విచారణ చేయించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటా. ప్రజాప్రతినిధులు ఏ కార్యాలయానికొచ్చినా కూర్చోబెట్టి వారి సమస్య విని, పరిష్కరించాల్సిందే.

– డాక్టర్ వినోద్‌కుమార్, జిల్లా కలెక్టర్

సీనియర్ డీఎఫ్ఎంగా రామిరెడ్డి

గుంతకల్లు: గుంతకల్లు రైల్వే సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ (డీఎఫ్ఎం)గా పగడల వి.రామిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు డిప్యూటీ సీఏఓ జనరల్ జీ.శ్రీధర్ బాబు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గుంతకల్లు సీనియర్ డీఎఫ్ఎం ప్రదీప్‌బాబు ఇటీవల సీబీఐ వలలో చిక్కుకుని ప్రసుత్తం రిమాండ్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయన స్థానంలో సికింద్రాబాద్‌లో డిప్యూటీ ఎఫ్ఏసీఏఓ (వర్క్‌షాపుగా) ఉన్న రామిరెడ్డిని గుంతకల్లు సీనియర్ డీఎఫ్ఎంగా బదిలీ చేశారు. సీబీఐ కేసులో రిమాండ్‌లో ఉన్న డీఆర్ఎం వినీత్‌సింగ్ స్థానంలో ప్రస్తుత ఏడీఆర్ఎం సుధాకర్ ఇన్‌చార్జ్ డీఆర్ఎంగా కొనసాగుతున్నారు. త్వరలో రైల్వే బోర్డు నిర్ణయం మేరకు గుంతకల్లుకు నూతన డీఆర్ఎంను నియమించనున్నట్లు డివిజన్ కార్యాలయ వర్గాల ద్వారా తెలిసింది.

జీప్యాట్‌లో సత్తా

- 19 మంది విద్యార్థులకు జాతీయ స్థాయిలో ర్యాంకులు



జాహ్నవి



కే. గణేష్



కే. గురుచరణ్

అనంతపురం: జీ ప్యాట్ (గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్)-2024లో జేఎన్‌టీయూ అనంతపురం ఓటీపీఆర్ఐ విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం 19 మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో గణనీయమైన ర్యాంకులు సాధించి జేఎన్‌టీయూ ప్రతిష్టను ఇనుమడింపజేశారు. జాతీయ స్థాయిలో ఉన్న ఫార్మసీ కళాశాలల్లో ఎంఫార్మసీ అడ్మిషన్ల కోసం జీ ప్యాట్‌ను నిర్వహిస్తారు. నైపర్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్) కళాశాలల్లో ఎంఫార్మసీ అడ్మిషన్లు కల్పిస్తారు. ఫార్మాసూటికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఎంఫార్మసీలో స్టైఫండ్ కల్పిస్తుంది. నెలకు రూ.12,400 స్టైఫండ్ ఇస్తారు. నైపర్ కళాశాలలు మొహాలి, అహ్మదాబాద్, గౌహతి, హాజీపూర్, హైదరాబాద్, కోల్‌కతా, రాయబరేలీలో ఉన్నాయి. సత్తా చాటిన విద్యార్థులను జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐ డైరెక్టర్, పాలకమండలి సభ్యుడు ప్రొఫెసర్ బి. దుర్గాప్రసాద్ అభినందించారు.

ర్యాంకులు సాధించిన విద్యార్థులు

విద్యార్థి పేరు	ర్యాంకు
కే. జాహ్నవి	1,374
కే. గణేష్	1,650
కే. గురుచరణ్	1,753
బి. ప్రేమలత	2,228
డి. హేమంత్	3,098
కే. అనిల్ కుమార్	3,889
ఎ. విజ్ఞత	4,523
పి. యశ్వంత్	5,352
జెడ్. తబుస్సుమ్	7,059
బి. నవీన్	8,100
జగదీశ్వర గౌడ్	8,751
వై. మురళీధర్	8,756
బి. జయచంద్ర	9,203

జిల్లాలో 3 రోజుల్లో వర్షాలు



బుక్కరాయసముద్రం:జిల్లాలో 3 రోజుల్లో వర్షాలు పడే అవకాశముందని రేకులకుంట ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పగటి ఉష్ణోగ్రతలు 35.1–36.6, రాత్రి ఉష్ణోగ్రతలు 25.2– 25.9 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 63–71 శాతం, మధ్యాహ్నం 45–55 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

అక్కపై గొడ్డలితో దాడి

గార్లదిన్నె: ఇంటి స్థల వివాదంలో సొంత అక్క, ఆమె కుమార్తెపై ఓ వ్యక్తి గొడ్డలితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం పెనకచెర్ల డ్యాం గ్రామంలో నివాస ముంటున్న షేక్ జిలాన్ బాషాకు కొంతకాలంగా కుటుంబసభ్యులతో ఆస్తి వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంటి వద్ద స్థలం విషయమై అక్క మహబూబ్‌బీతో జిలాన్ బాషా ఘర్షణ పడ్డాడు. ఆ సమయంలో తీవ్ర ఆవేశానికి లోనైన జిలాన్ గొడ్డలితో అక్కపై దాడి చేశాడు. అక్కడే ఉన్న మహబూబ్‌బీ కుమార్తె షకూన్‌బీ అడ్డుకోబోయింది. దీంతో ఆమెపై కూడా గొడ్డలితో దాడి చేశాడు. చుట్టుపక్కల వారు అడ్డుకుని క్షతగాత్రులను వెంటనే అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి, బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దాడికి పాల్పడిన జిలాన్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు.

అగ్నివీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ఎడ్యుకేషన్:అగ్నివీర్ పథకంలో భాగంగా ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో ఉద్యోగాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎ.కళ్యాణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో పని చేసేందుకు కనీసం ఇంటర్ ఇంగ్లిష్, ఫిజిక్స్, మ్యాథ్స్‌లో 50 శాతం మార్కులు లేదా మూడేళ్ల ఇంజినీరింగ్ డిప్లొమా, తత్సమాన విద్యార్హత ఉండాలని పేర్కొన్నారు. ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. అవివాహిత యువతీ, యువకులు అర్హులన్నారు. ఎంపిక ప్రక్రియ మూడు అంచెలుగా ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో రాతపరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్, మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌లతో పాటు ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందన్నారు. https://agnipathvayyu.cdac.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 08554–245547 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు దరఖాస్తులు

అనంతపురం ఎడ్యుకేషన్: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇన్‌స్పైర్ అవార్డులకు విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మీ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రాజెక్టులను సమర్పించడానికి నామినేషన్ల ప్రక్రియ మొదలైందన్నారు. జిల్లాలోని ప్రతి ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6–10 తరగతుల విద్యార్థుల నుంచి నాణ్యమైన నమూనాలను సిద్ధం చేయించి ఇన్‌స్పైర్ మనక్ www.inspireawards-dst.gov.in వెబ్‌సైట్‌లో సెప్టెంబరు 15లోగా నమోదు చేసేలా చూడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్, కేజీబీవీ, సొసైటీ యాజమాన్యాల పాఠశాలలు ప్రిన్సిపాళ్లు, హెచ్ఎంలు చొరవ తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఏవైనా సందేహాలుంటే జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణను 89859 34531 నంబరులో సంప్రదించాలని డీఈఓ సూచించారు.

బాబ్బాబు.. అక్కడికి పంపరా!

- పోస్టింగ్‌ల కోసం జోరుగా పైరవీలు
- నాయకుల ఇళ్లచుట్టూ ప్రదక్షిణ
- రాజకీయ అండదండలు లేని అధికారుల్లో ఆవేదన
- ఎక్కడ పోస్టింగ్ వేస్తారోనని ఆందోళన
- బదిలీలు మొత్తం రాజకీయంగా మారాయని గగ్గోలు
- వీఆర్ఓలు మొదలు సీఐల వరకూ అందరిదీ ఇదే పరిస్థితి
- తాడిపత్రికి పోస్టింగ్ అంటే పలువురు ఉద్యోగుల ససేమిరా



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో బదిలీల ఉత్కంఠ రోజు రోజుకూ పెరుగుతోంది. తమకు ఎక్కడ పోస్టింగ్‌లు వస్తాయో, ఎక్కడ వేస్తారో అర్థం కాక చాలామంది ఉద్యోగులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రతి పోస్టు రాజకీయ రంగు పులుముకోవడంతో సిబ్బందిలో ఆందోళన మొదలైంది. వీఆర్ఓ స్థాయి నుంచి డీఎస్పీ స్థాయి పోస్టింగ్ వరకూ రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటు అనంతపురం, అటు శ్రీ సత్యసాయి జిల్లాలో ఎక్కడ చూసినా అధికారుల రాజకీయ బదిలీలపైనే చర్చ జరుగుతోంది.

నేతల ఇళ్ల వద్ద తహసీల్దార్ల చక్కర్లు

ఎన్నికల నోటిఫికేషన్ రాగానే స్థానికంగా ఉన్న తహసీల్దార్లందరూ ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. ఇప్పుడు వీళ్లందరూ ఉమ్మడి అనంత జిల్లాకు వస్తారు. వీళ్లకు మంచి మండలంలో పోస్టింగ్ రావాలంటే ఎమ్మెల్యే అండదండలు లేకుండా సాధ్యం కాదు. దీంతో తహసీల్దార్లు ఎమ్మెల్యేల ఇంటిచుట్టూనే చక్కర్లు కొడుతున్నారు. కొంతమంది అయితే పదవీ విరమణకు దగ్గరగా ఉన్నామని, మారుమూల మండలానికి వేయొద్దంటూ వేడుకుంటున్న పరిస్థితి. వీరితో పాటు డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు సైతం ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నట్టు తెలిసింది.

సీఐల తిప్పలు అన్నీ ఇన్నీ కావు..

అన్నిటికంటే సీఐల బదిలీల అంశం హాట్ టాపిక్‌గా మారింది. తమ సిఫార్సు లేకుండా ఒక్క సీఐ కూడా రావడానికి వీల్లేదని ఇప్పటికే ఎమ్మెల్యేలు సంబంధిత ఉన్నతాధికారులకు చెప్పారు. ఈ నేపథ్యంలో వారం రోజులుగా కొంతమంది సీఐలు పోస్టింగ్‌ల కోసం నేతల ఇళ్ల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. కొంతమంది కిందిస్థాయి నాయకులను వెంటబెట్టుకుని మాట్లాడుతున్నారు. బంధువర్గం, దూరపు చుట్టరికం ఇలా ఏది కుదిరితే అలా ముందు పోస్టింగ్ తెచ్చుకునేందుకు శతవిధాలా యత్నిస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదని,ప్రభుత్వం మారగానే సాధారణంగా జరిగేవని ఓ సీఐ వ్యాఖ్యానించారు.

రాజకీయ అండదండలు లేకపోతే అంతే

రాజకీయ అండదండలు లేకపోతే ఈ ప్రభుత్వంలో పోస్టింగ్‌లు తెచ్చుకోవడం సాధ్యం కాదని పలువురు అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఎలాగోలా సిఫార్సు చేయించుకోకపోతే అనుకున్న పోస్టింగ్ రాదని, ఎక్కడో దూరంగా వేస్తారని రెవెన్యూ విభాగానికి చెందిన ఓ అధికారి చెప్పుకొచ్చారు. నిజాయితీగా పని చేసినా సరే నేతల సిఫార్సులు తప్పకుండా ఉండాలని, రాజకీయ అండదండలు లేని అధికారులు ఎవరైనా ప్రాధాన్యత లేని పోస్టుల్లో కొనసాగాల్సిందేనని అధికారుల్లో చర్చ జరుగుతోంది.

తాడిపత్రికి ససేమిరా..

ఇటీవల తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలు ఉద్యోగుల్లో భయాందోళన సృష్టించాయి. రవాణా శాఖ అధికారి అత్తికానాజ్ గురించి మాట్లాడిన తీరుతో ఉద్యోగుల్లో మనోస్థైర్యం దెబ్బతింది. దీంతో చాలామంది అధికారులు తాడిపత్రి ప్రాంతంలో పోస్టింగ్‌కు ససేమిరా అంటున్నట్లు తెలిసింది. కొంతమంది ఉద్యోగులైతే తాడిపత్రికి మినహా ఎక్కడికి వేసినా వెళతామనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అక్కడ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని, గతంలో వేరు, ఇప్పుడు వేరు అంటూ ఉద్యోగులు అంటున్నారు. తహసీల్దార్లు సైతం ఆ నియోజకవర్గంలోని మండలాలకు వెళ్లడానికి విముఖత చూపుతున్నారు. ఇక పోలీసులైతే తాడిపత్రి పోస్టింగ్ అంటేనే కత్తిమీద సాము అంటున్నారు.

క్లుప్తంగా

రూ.8.67 కోట్లతో ఉద్యాన పథకాలు

- ఉద్యానశాఖ డీడీ ఫిరోజ్‌ఖాన్



అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పథకాలు అమలు చేయడానికి రూ.8.67 కోట్ల బడ్జెట్‌తో ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆ శాఖ డీడీ జి.ఫిరోజ్‌ఖాన్ మంగళవారం సాక్షికి తెలిపారు. ఇటీవల కొత్త ప్రభుత్వం కొలువుతీరినందున పథక నిర్దేశన, కొత్తగా మార్గదర్శకాలు త్వరలో విడుదల కానున్నాయన్నారు. కమిషనరేట్ ఆదేశాల మేరకు ప్రతిపాదనలు పంపామన్నారు. సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం (ఎంఐడీహెచ్) కింద కొత్తగా 725 హెక్టార్లలో పండ్ల తోటల విస్తరణకు రూ.1.15 కోట్లు, 69 ఫారంపాండ్స్ నిర్మాణానికి రూ.1.29 కోట్లు, 90 ప్యాక్ హౌస్‌ల ఏర్పాటుకు రూ.1.80 కోట్లు, 20 కలెక్షన్ సెంటర్ల మంజూరుకు రూ.1.05 కోట్లు, ఆర్‌కేవీవై కింద రూ.1.29 కోట్లు, ఆయిల్‌ఫాం కింద రూ.1.02 కోట్లు ప్రతిపాదించగా... పండ్లతోటల నిర్వహణ, పుట్టగొడుగుల యూనిట్లు, ప్లాస్టిక్ మల్చింగ్, యాంటీబర్డ్‌నెట్, సోలార్ కోల్డ్‌రూమ్‌లు, రూరల్ మార్కెటింగ్ సెంటర్లు, యాంత్రీకరణ, తేనెటీగల పెంపకం, నర్సరీలు తదితర వాటి కింద పథకాలు, బడ్జెట్ ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. ప్రభుత్వం, కమిషనరేట్ నుంచి అనుమతులు అందగానే వీటిని అమలు చేస్తామని పేర్కొన్నారు.

యువకుడి బలవన్మరణం



మాబు (ఫైల్)

ఆత్మకూరు: మద్యానికి బానిసైన ఓ యువకుడు చివరకు అప్పుల పాలై జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... ఆత్మకూరుకు చెందిన మాబుకు ఏడాదిన్నర క్రితం వివాహమైంది. ఆర్‌ఎంపీగా నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ప్రజల్లో మంచిపేరు తెచ్చుకున్నాడు. అయితే కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబసభ్యులు ఎంత నచ్చచెప్పినా వినకుండా పెడచెవిన పెడుతూ వచ్చాడు. తన స్థాయికి మించి అప్పులు చేశాడు. చివరకు అప్పులు తీర్చే మార్గం కానరాక జీవితంపై విరక్తితో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని గమనించిన తల్లిదండ్రులు వెంటనే కాపాడి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మాబు మృతిచెందినట్లు నిర్ధారించారు. ఒక్కగానొక్క కుమారుడు కళ్ల ముందు నిర్జీవంగా పడి ఉండడం చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

'అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ పరిధిలోని కక్కలపల్లి పొలం సర్వే నంబర్ 14–2లో 6.80 ఎకరాల భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా లేఔట్ వేసి ప్లాట్లు విక్రయిస్తున్నారు. వీరికి పంచాయతీ తరపున నోటీసులు జారీ చేసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ సర్వే నంబరులోని లేఔట్‌లో ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా నిరోధించి ప్రభుత్వానికి కలిగిస్తున్న నష్టాన్ని నివారించేలా చర్యలు తీసుకోవాలి. అనధికార లేఔట్‌లో ప్లాట్లు కొనుగోలు చేస్తున్న ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది' అని స్వయంగా కక్కలపల్లి కాలనీ పంచాయతీ కార్యదర్శి గతనెల 16న అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్‌కు రాసిన లేఖ ఇది.



'కక్కలపల్లి పొలం సర్వే నంబరు 14–2లోని 6.80 ఎకరాల భూమిలో అభివృద్ధి చేస్తున్న అనధికార లేఔట్‌కు అహుడా వారి నుంచి కానీ, పంచాయతీ నుంచి కాని ఎలాంటి అనుమతులు లేవు. సదరు అనధికార లేఔట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసినా పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వబడవు. ఈ అనధికార లేఔట్‌లో ప్లాట్లు ఎవరైనా అమ్మకాలు చేసినా, కొనుగోలు చేసినా చర్యలుంటాయి. అలాంటి లావాదేవీలతో పంచాయతీ కార్యాలయానికి ఎలాంటి సంబంధం ఉండదు' అంటూ లేఔట్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఇది. అయినా ఇవేవి పట్టించుకోని నిర్వాహకులు టీడీపీ ప్రభుత్వ అండతో ఎలాంటి అనుమతులు లేకుండానే విక్రయాలు చేపట్టారు. రిజిస్ట్రేషన్ చేయించేందుకు చకాచకా ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు.



అక్రమ లేఔట్‌కు అడ్డదారి

- అధికారం మారడంతో కదలిక
- పంచాయతీ, రిజిస్ట్రేషన్ అధికారులకు భారీగా తాయిలాలు
- త్వరలో ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు రంగం సిద్ధం
- ఒత్తిళ్లు తాళలేక సెలవుపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి
- ప్రభుత్వ ఆదాయానికి రూ.8 కోట్ల గండి



లేఔట్‌లో రోడ్డును అభివృద్ధి చేసిన దృశ్యం

రాప్తాడు రూరల్: అనంతపురం నగర శివారున కక్కలపల్లి కాలనీ పంచాయతీ పరిధిలోని కళ్యాణదుర్గం రోడ్డులో బాలాజీ విల్లాస్, జయలక్ష్మీ విల్లాస్ సమీపంలో అనధికార లేఔట్ ఏర్పాటైంది. మొత్తం 6.80 ఎకరాల్లో సెంటు మొదలుకుని 5.25 సెంట్ల వరకు మొత్తం 147 ప్లాట్లు వేశారు. ఇప్పటికే దాదాపు 60 శాతం ప్లాట్లు అమ్మేశారు. సెంటు రూ. 6.50 లక్షల నుంచి 7 లక్షల వరకు విక్రయించినట్లు తెలిసింది. నిబంధనల ప్రకారం లేఔట్‌లో పది శాతం భూమిని సంబంధిత పంచాయతీకి కేటాయించాలి. ఈ లెక్కన ఇక్కడ 68 సెంట్లు ఇవ్వాల్సి ఉంది. లేదా అంతమేర భూమి విలువ సొమ్ము పంచాయతీకి చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఇక్కడ సెంటు రూ. 7 లక్షల వరకు విక్రయాలు సాగుతున్నాయి. ఈ ప్రకారం 68 సెంట్లకు రూ. 4.76 కోట్లు, అహుడా అనుమతుల కోసం దాదాపు రూ.3 కోట్ల వరకు మొత్తం రూ.7.76 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాలి. అయితే నిర్వాహకులు పైసా చెల్లించకుండా ఎగ్గొడుతున్నా ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం చర్చనీయాంశమైంది.

టీడీపీ నేతల ఒత్తిళ్లు తాళలేక..

ఈ లేఔట్‌కు అనుమతులు లేని కారణంగా దాదాపు మూన్నెళ్ల క్రితమే పంచాయతీ అధికారులు అభివృద్ధి పనులు చేయకుండా అడ్డుకున్నారు. పనులు ఆపించారు. ఈ క్రమంలో టీడీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీ అనంతపురం రూరల్ మండలానికి చెందిన ఓ ద్వితీయ శ్రేణి నాయకుడు రంగంలోకి దిగాడు. పంచాయతీ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాను చూసుకుంటానని డీల్ కుదుర్చుకున్నాడు. నియోజకవర్గానికి చెందిన ఓ ముఖ్య నాయకుడి దృష్టికి తీసుకెళ్లి (ఇక్కడ అసలు విషయం దాచిపెట్టాడు) పంచాయతీ కార్యదర్శిపై లేనిపోని అబద్ధాలు సృష్టించి మానసిక వేధింపులకు గురి చేసేలా చేశాడు. దీంతో ఒత్తిళ్లు తాళలేక సదరు కార్యదర్శి ఇటీవల సెలవులో వెళ్లాడు. ఆయన సెలవుపై వెళ్లగానే లేఔట్‌లో గుట్టుగా తారురోడ్డు పనులు చేపట్టారు. మూడు నెలలుగా నిలబెట్టిన పనులు ఇప్పుడు ఆగమేఘాల మీద చకచకా జరుగుతున్నాయి.

త్వరలో రిజిస్ట్రేషన్ చేసేలా ప్రణాళిక

ఈ అనధికారిక లేఔట్‌లోని ప్లాట్లకు త్వరలో రిజిస్ట్రేషన్లు చేయించేలా ప్రణాళికలు రచించినట్లు తెలిసింది. ఈ క్రమంలో సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనూ భారీగా కమీషన్లు ముట్ట చెప్పినట్లుగా సమాచారం. తాము కోరినంత దక్కడంతో కృతజ్ఞతగా రిజిస్ట్రేషన్లకు సదరు అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది.

ఉన్నతాధికారులు స్పందించరా?

సర్వే నంబరు 14–2లోని అనధికార లేఔట్ ద్వారా ప్రభుత్వానికి రూ.కోట్లలో నష్టం కలుగుతోందంటూ కలెక్టర్, అహుడా వైస్ చైర్మన్, పంచాయతీరాజ్ కమిషనర్, సబ్‌రిజిస్ట్రార్, డివిజనల్ పంచాయతీ అధికారి, జిల్లా పంచాయతీ అధికారికి పంచాయతీ అధికారులు లేఖలు రాశారు. ఆయా శాఖల అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో అనేదానిపై అందరి దృష్టి నిలిచింది.

ఫార్మసీ విద్యార్థినికి జాతీయ స్థాయి అవార్డు



విద్యార్థిని ఫాతిమా జోహ్రాను అభినందిస్తున్న అధ్యాపకులు

హిందూపురం: స్థానిక మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ ఫార్మసీ (డీ–ఫార్మసీ) చదువుతున్న ఎస్.ఫాతిమా జోహ్రా జాతీయ స్థాయిలో అందించే కేకే ఆచార్జీ అవార్డును అందుకున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.హరీష్‌బాబు మంగళవారం తెలిపారు. ఏటా డీ–ఫార్మసీలో అత్యుత్తమైన మార్కులు సాధించిన వారికి జాతీయ స్థాయిలో కేకే ఆచార్జీ అవార్డులు అందజేస్తారన్నారు. ఈ క్రమంలో 2023–24 విద్యాసంవత్సరానికి గాను 96.14 శాతం మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచిన ఎస్.ఫాతిమా జోహ్రాకు అవార్డు దక్కింది. హైదరాబాదులో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకూ న్యూఢిల్లీ ఇండియన్ హాస్పిటల్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ నిర్వహించిన 73వ ఐపీసీ–2024 కాన్ఫరెన్స్‌లో అవార్డుతో పాటు రూ.5వేల నగదు, జ్ఞాపికను ఆమె అందుకుంది. దీంతో మంగళవారం కళాశాలలో విద్యార్థిని ప్రిన్సిపాల్ హరీష్‌బాబు, అధ్యాపకులు అభినందించారు.

ద్విచక్ర వాహన దొంగల అరెస్ట్

ధర్మవరం అర్బన్: ద్విచక్ర వాహనాలను అపహరించుకెళుతున్న దొంగలను అరెస్ట్ చేసి, 12 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. వివరాలను మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. కూలి పనులతో జీవనం సాగిస్తున్న గుర్రంపాటి రాకేష్ రణదీప్ (రాఖీ), మేకల నరసింహులు, నీలి సతీష్‌కుమార్ వ్యసనాలకు బానిసై సులువుగా డబ్బు సంపాదించేందుకు ద్విచక్ర వాహనాల అపహరణకు తెరదీశారు. ఈ క్రమంలో ధర్మవరంలోని పలు వార్డుల్లో సంచరిస్తూ ఇళ్ల ఎదుట నిలిపిన ద్విచక్ర వాహనాలను గుర్తించి, అర్ధరాత్రి దాటిన తర్వాత అపహరించుకెళ్లేవారు. ఆయా ఘటనలపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో శివానగర్ శివాలయం సమీపంలోని పాడుబడిన ఇంటి వద్ద మంగళవారం రాకేష్ రణదీప్, సతీష్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. వీరి నుంచి 12 ద్విచక్రవాహనాలు, కటింగ్ ప్లేయర్, వైర్ కట్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న నరసింహులును త్వరలో అరెస్ట్ చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.

మహిళా రైతు ఆత్మహత్య



మృతురాలు శివలక్ష్మి

బత్తలపల్లి: పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక మహిళా రైతు ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరుకు చెందిన బత్తిని బత్తినన్న, శివలక్ష్మి (33) దంపతులకు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తమకున్న రెండు ఎకరాల పొలంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో పంటల సాగుకు దాదాపు రూ.5 లక్షల వరకూ అప్పులు చేశారు. ఏటా పెట్టుబడుల భారం పెరగడమే తప్ప ఆశించిన స్థాయిలో పంట దిగుబడులు రాక వడ్డీ భారం పెరిగింది. ఈ ఖరీఫ్‌లో మంచి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చేసిన సూచనలతో ఈసారైనా అప్పులు తీరుతాయని భావించారు. అయితే ఇప్పటి వరకూ చినుకు జాడ లేకుండా పోయింది. దీంతో భవిష్యత్తు తలుచుకుని భయపడిన శివలక్ష్మి జీవితంపై విరక్తితో సోమవారం పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక సోమవారం రాత్రి ఆమె మృతి చెందింది. మృతురాలి తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

పూర్వ విద్యార్థిని సన్మానించిన నవోదయ అధ్యాపకులు



విష్ణుతేజ్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు

లేపాక్షి: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ పూర్వ విద్యార్థి, అమెరికాలో చదువుకుంటున్న విష్ణుతేజ్‌ను మంగళవారం విద్యాలయ అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతపురం జిల్లా నార్పలకు చెందిన విష్ణుతేజ్ అమెరికాలోని ఫాజిల్ రిడ్జ్ హైస్కూల్‌లో చదువుకుంటున్నాడు. ఈ క్రమంలో సెలువుపై సొంతూరికి వచ్చిన విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థుల కోరిక మేరకు మంగళవారం నవోదయ విద్యాలయను సందర్శించి, పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోబోటిక్స్ అండ్ స్టెం ప్రజెంటేషన్ అంశంపై ఆయన ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ విద్యార్థుల్లో ఆలోచన శక్తిని రేకెత్తించింది. ఇందుకు కృతజ్ఞతగా విష్ణుతేజ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగరాజు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో నిర్బంధాలా?

- మాజీ ఎంపీ తలారి రంగయ్య
- ఎట్టకేలకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పరామర్శ
- పోలీసుల వలయంలో మలయనూరు



పూజారి లక్ష్మీకాంత్‌తో మాట్లాడుతున్న మాజీ ఎంపీ రంగయ్య, ఉమామహేశ్వరనాయుడు

కుందుర్పి: గతంలో ఎన్నడూ లేని విధంగా నిర్బంధాల మధ్య ప్రజలు జీవించేలా చంద్రబాబు పాలన సాగుతోందని, ఉగ్రవాద ప్రభావిత ప్రాంతాలైన ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌లోనూ ఇంతటి నిర్బంధాలు ఉండవని మాజీ ఎంపీ తలారి రంగయ్య మండిపడ్డారు. ఎన్నికల అనంతరం కుందుర్పి మండలం మలయనూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త పూజారి లక్ష్మీకాంత్ ఇంటిని టీడీపీ నాయకులు ధ్వంసం చేసి, కుటుంబసభ్యులపై దాడి చేసిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ మొత్తాన్ని ఇచ్చేందుకు సోమవారం ఉదయం తలారి రంగయ్య, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమామహేశ్వరనాయుడు తదితరులు మలయనూరుకు బయలుదేరారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుల కనుసన్నల్లో పోలీసులు వ్యవహరిస్తూ పెద్దసంఖ్యలో మోహరించి రంగయ్యను అడ్డుకున్నారు. మలయనూరుకు వెళ్లేందుకు అనుమతి లేదని నిరాకరించారు. గ్రామ శివారులోని రంగయ్యతో పాటు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో మంగళవారం మరోసారి ఎంపీ రంగయ్య, నాయకులు మలయనూరుకు చేరుకునేందుకు ప్రయత్నించారు. దీంతో మలయనూరును పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రశాంతంగా ఉండే గ్రామంలో ఎలాంటి గొడవలు, సమస్యలు లేవని తెలిసీ అత్యుత్సాహం ప్రదర్శించారు. డీఎస్పీ, ముగ్గురు సీఐలు, 8 మంది ఎస్ఐలు, 50 మంది స్పెషల్ పార్టీ పోలీసులు రంగంలో దిగారు. పోలీసుల పర్యవేక్షణలోనే ఎంపీ రంగయ్య, ఉమామహేశ్వరనాయుడు తదితర ఐదుగురు వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామంలోకి ప్రవేశించి బాధిత లక్ష్మీకాంత్‌ను పరామర్శించారు. ధ్వంసమైన ఇంటిని పరిశీలించారు. అనంతరం పార్టీ తరపున అధినేత వైఎస్ జగన్ అందజేసిన ఆర్థిక సాయం చెక్కును లక్ష్మీకాంత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... రాష్ట్రంలో నిర్బంధాల పాలన ప్రారంభమైందన్నారు. ప్రజాస్వామ్యంలో ఈ తరహా పాలన సాగించిన వారు బాగుపడిన దాఖలాలు లేవని చరిత్ర చెబుతోందన్నారు. సోమవారం తాను ఒంటరిగా వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తానన్నా అనుమతి కావాలని పోలీసులు చెప్పడం చూస్తుంటే ప్రజాస్వామ్యాన్ని టీడీపీ ప్రభుత్వం ఖూనీ చేసిందనే విషయం అర్థమవుతోందన్నారు. రాజకీయాలకు అతీతంగా స్పందించాల్సిన తరుణంలో కక్షపూరిత విధానాలు సరైనవి కావన్నారు. ఇప్పటికైనా టీడీపీ పాలకులు, నాయకుల్లో మార్పు రాకపోతే ప్రజలే సరైన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాజు, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

'సంస్కృతి' విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు దక్కించుకున్న విద్యార్థులతో సంస్కృతి కళాశాల యాజమాన్యం

పుట్టపర్తి అర్బన్: జిల్లా కేంద్రంలోని సంస్కృతీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ 16 మంది విద్యార్థులు ప్రతిభ చాటి ప్రముఖ ఐటీ కంపెనీలో ఉద్యోగాలు దక్కించుకున్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. మంగళవారం ఆ కళాశాలల చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం బెంగళూరుకు చెందిన ప్రముఖ ఐటీ కంపెనీ ×24/7 ఏఐ౯ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో కళాశాలకు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. మొత్తం రెండు రౌండ్ల ఇంటర్వ్యూలను కంపెనీకి చెందిన హెచ్‌ఆర్ దివ్య, శ్రీకన్య నిర్వహించి 16 మంది విద్యార్థులకు ఉద్యోగాలకు సంబంధించిన ఆఫర్ లెటర్లను అందజేసినట్లు తెలిపారు. సత్యసాయి బాబా ఆశీస్సులతో ప్రతి విద్యార్థి ఉద్యోగాన్ని సాధించేలా తమ కళాశాలలో తీర్చిదిద్దుతున్నామని, దీనికి విద్యార్థుల కృషి కూడా తోడవడంతో ఆశించిన మేర ఫలితాలు సాధిస్తున్నట్లు డీన్ డాక్టర్ బాలకోటేశ్వరి తెలిపారు. ఎంపికైన 16 మంది విద్యార్థులకు రూ.4.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు దక్కాయన్నారు. 2024–25లో తొలి విడతలోనే ఉన్నత శ్రేణి ఉద్యోగాలు దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. త్వరలో మరిన్ని కంపెనీలు క్యాంపస్ డ్రైవ్ చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని, ఈ క్రమంలో విద్యార్థులందరికీ ఉద్యోగాలు దక్కేలా ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

'జీవిత బీమా' పరిహారం పేరుతో మోసం

బెళుగుప్ప: జీవిత బీమా పరిహారం పేరుతో బాధిత కుటుంబసభ్యుల నుంచి నగదును సైబర్ నేరగాళ్లు అపహరించారు. మృతుడి సోదరుడు చిన్నతిప్పేస్వామి తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలం నక్కలపల్లికి చెందిన తిప్పేస్వామి (44) మూడు రోజుల క్రితం మృతిచెందాడు. ఆయన మృతి నుంచి కుటుంబసభ్యులు ఇంకా కోలుకోలేదు. మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన వ్యక్తికి ఓ వ్యక్తి 7975190159 నంబర్ ద్వారా ఫోన్ చేసి తాను డీఎస్పీనని పరిచయం చేసుకున్నాడు. మూడు రోజుల క్రితం చనిపోయిన వడ్డే తిప్పేస్వామికి రూ. 8 లక్షల జీవిత బీమా పరిహారం మంజూరైందని, అయితే జీఎస్టీ కింద రూ.18,500 చెల్లించిన వెంటనే పరిహారం అందుతుందని నమ్మబలికాడు. సదరు వ్యక్తి ద్వారా విషయం తెలుసుకున్న చిన్న తిప్పేస్వామి రూ.18,500ను 96111 56511కు ఫోన్ ద్వారా చెల్లించాడు. అనంతరం అవతలి వ్యక్తి నుంచి ఎలాంటి స్పందన లేకుండా పోయింది. దీంతో తాము మోసపోయినట్లు నిర్ధారించుకుని వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు అవార్డులు

అనంతపురం కల్చరల్: ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్యవైశ్య విద్యార్థులకు అవార్డులు అందజేయనున్నట్లు అవోపా ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు జయంతి శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 8వ తరగతి నుంచి పీజీ వరకూ చదువుకున్న వారి ప్రతిభ ఆధారంగా అవార్డుల ప్రదానం ఉంటుంది. ఆసక్తి కల్గిన విద్యార్థులు ఈ నెల 10 నుంచి ఆగస్టు 15వ తేదీలోపు అనంతపురంలోని రాజు రోడ్డులో ఉన్న అవోపా కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు దరఖాస్తులను అందజేయాలి. పూర్తి వివరాలకు 94907 27460లో సంప్రదించవచ్చు.





విదేశీ అతిథుల రాక

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న చెరువులో విదేశీ పక్షుల సందడి నెలకొంది. ఏటా సంతానోత్పత్తిలో భాగంగా విదేశీ పక్షులు జిల్లాకు రావడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో మంగళవారం అనంతపురం మీదుగా వెళుతూ కాసేపు చెరువులో విశ్రమించాయి. గూడబాతులు, ఫ్లెమింగోలుగా వీటిని పిలుస్తుంటారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం







క్లుప్తంగా

చెట్లే జగతికి మూలాధారం



ర్యాలీని ప్రారంభిస్తున్న శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీచైతన్య రెసిడెన్షియల్ స్కూల్ ఆవరణలో మంగళవారం 'గ్రీన్ ఇండియా మిషన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెట్లే జగతికి మూలాధారం అన్నారు. వాతావరణం సమతుల్యంగా ఉండడానికి ప్రతి ఒక్కరూ తప్పకుండా మొక్కలు నాటాలన్నారు. చెట్లు కాలుష్యాన్ని నివారిస్తాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి వారు పుట్టిన రోజున ఒక మొక్క నాటాలని సూచించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. తొలుత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీనాఖాన్, వైస్ ప్రిన్సిపాల్ షమీనా, అకడమిక్ కో–ఆర్డినేటర్ నాగభూషణం, డీన్ సత్యనారాయణ, చంద్రమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొహర్రం ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

కనగానపల్లి: గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలను జరుపుకునేందుకు తప్పనిసరిగా పోలీసుల నుంచి అనుమతి పొందాలని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. గ్రామ పెద్దలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు అందరూ కలసి పోలీస్ స్టేషన్‌కు వచ్చి అనుమతి పొందాలన్నారు. మొహర్రం ఉత్సవాల్లో ఎక్కడైనా వర్గ వైషమ్యాలతో ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ప్రజలంతా ఐకమత్యంతో ఉండాలని పేర్కొన్నారు.

ఆర్జేడీకి సన్మానం



ఆర్జేడీ శామ్యూల్‌ను సన్మానిస్తున్న ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ)గా బాధ్యతలు చేపట్టిన శామ్యూల్‌ను మంగళవారం ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ప్రతినిధులు వైఎస్సార్ కడపలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్జేడీని కలిసిన వారిలో ఏపీపీఎస్‌ఏ సీఆర్‌ఓ కోటిరెడ్డి రవిచంద్రా రెడ్డి, కదిరి వాల్మీకి స్కూల్ కరస్పాండెంట్ అనిల్‌కుమార్ రెడ్డి, ఇతర యజమానులు ఉన్నారు.

నేడు బడ్జెట్, కౌన్సిల్ సమావేశం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలోని కౌన్సిల్ హాల్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు 2024–25 బడ్జెట్, కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మేఘ స్వరూప్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

మొక్కలను సంరక్షించుకుందాం



పంపనూరు ఆలయ ప్రాంగణంలో మొక్క నాటుతున్న అధికారులు

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని పంపనూరు ఆలయ ఈఓ అక్కిరెడ్డి సూచించారు. మంగళవారం పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అటవీశాఖ అధికారులతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాహనాల నుంచి వెలువడే పొగ వల్ల వాతావరణం కలుషితం అవుతోందన్నారు. మొక్కలు నాటడం వల్ల వర్షాలు కూడా సమృద్ధిగా కురుస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రాము శాస్త్రి, ఆనంద్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామికి ఆకు పూజ చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతి దేవికి ప్రత్యేక పూజలు జరిగాయి. మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

పెద్దమ్మా.. చల్లగా చూడమ్మా



ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మ దేవత



బోనాలతో ఆలయం వద్దకు చేరుకున్న మహిళలు



కల్లు కుండతో ఆలయం వద్దకు బయల్దేరిన దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మేడాపురంలో బోనాల పండుగ అంబరమంటింది. గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఏటా ఆషాఢమాసంలో పెద్దమ్మతల్లికి నిర్వహించే బోనాల సమర్పణ ఈసారి కూడా కొనసాగింది. మంగళవారం ఉదయమే గ్రామ సమీపంలో కల్లును దుత్తలో ఉంచి, పూజ చేసి, అక్కడ జంతు బలి ఇచ్చిన తర్వాత ఊరేగింపుగా గ్రామ నడిబొడ్డున గల ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ పెద్దమ్మతల్లి మూలవిరాట్‌కు అభిషేకాలు చేశారు. పలు రకాల పుష్పాలు, వెండి ఆభరణాలతో అలంకరించారు. ప్రతి గడప నుంచి మహిళలు భక్తిశ్రద్ధలతో బోనం (ప్రసాదం) వండి మేళతాళాల నడుమ ఆలయానికి ప్రదర్శనగా చేరుకున్నారు. బోనం తలపై పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన తర్వాత అమ్మ వారికి సమర్పించి.. ఫల, పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామపెద్దలు మాట్లాడుతూ గ్రామస్తులందరూ ఐకమత్యంతో ఏటా పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించడం ఆనవాయితీ అని చెప్పారు. ఇలా చేయడం వలన గ్రామంలోని ప్రజలు సుఖశాంతులతో సంతోషంగా ఉంటారన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండుతాయని తెలిపారు. బోనాల పండుగ సందర్భంగా ప్రతి ఇల్లూ బంధుమిత్రుల రాకతో కళకళలాడింది. ప్రత్యేక వంటలతో విందు ఆరగించి సంతోషంగా గడిపారు.

'కట్టడాలకు పటిష్టమైనది భారతీ సిమెంట్'



తాపీమేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్లను అందజేస్తున్న భారతీ సిమెంట్ కంపెనీ ప్రతినిధులు

అనంతపురం రూరల్: అత్యుత్తమ కట్టడాలకు పటిష్టమైనది భారతీ సిమెంట్ అని ఆ కంపెనీ టెక్నికల్ ఇంజినీర్ మోతీలాల్‌నాయక్ అన్నారు. మంగళవారం రుద్రంపేట పరిధిలోని హర్షిత ట్రేడ్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా టెక్నికల్ ఇంజినీర్ మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ.. నిర్మాణ రంగంలో సాటిలేని సిమెంట్ భారతీ సిమెంట్ అని పేర్కొన్నారు. స్లాబ్స్‌కు ధృడంగా ఉండటంతో పాటు పర్యావరణానికి అనుకూలంగా ఉంటుందన్నారు. తాపీ మేస్త్రీలు, కార్మికుల సంరక్షణకు కంపెనీ అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. కార్మికులందరూ ప్రమాద బీమా తీసుకోవడంతో పాటు పని ప్రదేశాల్లో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ సుబ్బరాయుడు, డీలర్ కొండ్రెడ్డి కష్టారెడ్డి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

నాకు సమాచారం ఇవ్వకుండా వస్తారా?

- ఎమ్మెల్యే దగ్గుపాటితో వాగ్వాదానికి దిగిన టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు జేఎల్ మురళి

అనంతపురం క్రైం: 'నాకు సమాచారం ఇవ్వకుండా మా ప్రాంతంలోకి ఎలా వస్తార'ని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌తో టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు జేఎల్ మురళి వాగ్వాదానికి దిగారు. మంగళవారం నగరంలోని వేణుగోపాల్ నగర్ సమీపంలోని ఎన్టీఆర్ మార్గ్ పెండింగ్ విషయంపై క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఎమ్మెల్యే దగ్గుపాటి అక్కడికి వెళ్లారు. అంతకుముందే ఎమ్మెల్యేను టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు జేఎల్ మురళి తేనీటి విందుకు ఆహ్వానించారు. అయితే ఎమ్మెల్యే తేనీటి విందుకు వెళ్లకుండా.. సమీపంలోని సచివాలయాన్ని పరిశీలించాలని స్థానికులు సూచించడంతో అక్కడికి వెళ్లారు. కాగా.. ఎమ్మెల్యే అటువైపుగా వస్తున్నారని తెలుసుకున్న జేఎల్ నేరుగా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుని గొడవకు దిగారు. అందరూ చూస్తుండగా చెలరేగిపోయిన ఆయన.. ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితంగా ఉన్న ఓ వ్యక్తిని బెదిరించాడు. తనకు సమాచారం ఇవ్వకుండా ఎలా వస్తారని కోపంతో ఊగిపోయారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకుని 'ఏదో పొరపాటు జరిగిందిలే మురళీ.. సారీ అప్పా' అని సర్దిచెప్పారు. దీంతో విస్తుపోవడం కార్యకర్తల వంతైంది. నగరంలో ఎమ్మెల్యే పర్యటించాలన్నా...జేఎల్ మురళి పర్మిషన్ కావాలా అంటూ ముక్కున వేలేసుకున్నారు.

విద్యార్థుల గ్యాంగ్‌వార్‌పై కేసు నమోదు

రాప్తాడురూరల్: ఇంజినీరింగ్ విద్యార్థుల గ్యాంగ్‌వార్‌పై అనంతపురం రూరల్ పోలీసులు 11 మందిపై కేసు నమోదు చేశారు. అమ్మాయి ప్రేమ విషయమై అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు రెండు గ్రూపులుగా విడిపోయి సోమవారం సాయంత్రం కళ్యాణదుర్గం రోడ్డు రజాక్ ఫంక్షన్ హాల్ సమీపంలో గొడవ చేసుకునేందుకు సిద్ధమయ్యారు. అదే సమయంలో వచ్చిన పోలీసులు అప్రమత్తం కావడంతో గొడవను అడ్డుకున్నారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు రెండు గ్రూపుల్లోని ముఖ్యమైన వారికి తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. కేసు నమోదు చేసిన 11 మందిని బుధవారం తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయనున్నారు.

గర్భిణులకు ఉచిత భోజన వసతి



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న దాతలు

రాప్తాడు: దాతల సహకారంతో ప్రతి నెల 9వ తేదీన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హైరిస్క్ గర్భిణులకు ఉచిత భోజన వసతి కల్పిస్తున్నట్లు వైద్యాధికారులు శివకృష్ణ, శ్రావణి తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం హైరిస్క్ గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. మండలంలోని గొందిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో శ్రీవాణి ప్యాకేజీ పరిశ్రమల ప్రొప్రైటర్ గంగాదేవి, ఆమె భర్త ఉదయ్ శంకర్ రెడ్డి సహకారంతో ఈనెల దాదాపు 80 మంది గర్భిణులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ.. గర్భిణులకు భోజన వసతి కల్పించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. మండలా వ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి వైద్యం కోసం వచ్చిన గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారని వైద్యాధికారులు చెప్పడంతోనే అన్నదానం చేపట్టామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి మంచి కార్యక్రమాలు మరిన్ని చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్స్ నరసింహ, అరుణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భావసార విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అనంతపురం కల్చరల్: నగరంలోని భావసార క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు ఆ సంఘం కార్యదర్శి ఆనందరావు మహేంద్రకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్ సెకండ్ ఇయర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీలోపు పూర్తి చేసిన దరఖాస్తులను స్థానిక రామనగర్‌లోని పాండురంగ స్వామి ఆలయంలో అందజేయాలని సూచించారు. ఈనెల 18న ఆలయంలో ప్రముఖుల ఆధ్వర్యంలో సన్మానించి, జ్ఞాపికలు అందజేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9440587120, 8520085234 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి ద్విచక్రవాహనం బోల్తాపడి నాగార్జున అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. యాడికి మండలం పిన్నేపల్లికి చెందిన నాగార్జున అనే వ్యక్తి పని నిమిత్తం గుత్తికి వచ్చాడు. పని ముగించుకుని ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా తొండపాడు గ్రామ శివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు నాగార్జునను అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అమరావతి హోటల్ వద్ద సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనలో అక్షయ్, యోగేందర్ అనే యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. గుత్తి ఆర్‌ఎస్‌కు చెందిన అక్షయ్, యంగన్నపల్లికి చెందిన యోగేందర్ అనే ఇద్దరు స్నేహితులు బైక్ వద్ద నిలబడి ఉండగా మరో బైక్ వచ్చి ఢీ కొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అక్షయ్ కాలు విరగడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా ఏబీవీపీ శోభాయాత్ర



మాట్లాడుతున్న ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకట నాయుడు



శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నగరంలో ఘనంగా శోభాయాత్ర చేపట్టారు. ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సంఘచాలక్ హిమకర్, విభాగ్ ప్రచారక్ లక్ష్మణ్ ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభించారు. ఎస్‌ఎస్‌బీఎన్ కళాశాల నుంచి ప్రారంభమైన యాత్ర సప్తగిరి సర్కిల్ మీదుగా టవర్ క్లాక్ వరకూ సాగింది. అక్కడ ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ అఖిల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏబీవీపీ 1948లో ప్రారంభమై 1949 జూలై 9న అధికారికంగా రిజిస్టర్ పొందిందన్నారు. ఈ రోజు 55 లక్షల పైచిలుకు విద్యార్థుల సభ్యత్వం కలిగి ఉందన్నారు. విద్యార్థుల్లో జ్ఞానం, శీలం, ఏకత నింపుతూ 'నేషన్ ఫస్ట్–సెల్ఫ్ నెక్స్ట్' అంటూ జాతీయ భావాలు, దేశభక్తిని పెంపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర అధ్యక్షులు రామాంజనేయులు, దివాకర్, యుగంధర్ రెడ్డి, విజయ్, నితిన్, మనిదీప్, భూతరాజు, హరి, విజయ్ పాల్గొన్నారు.

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద మంగళవారం ఏబీవీపీ 76వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకట నాయుడు హాజరై ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్కేయూ ఎవాల్యుయేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ రమణ, ప్రొఫెసర్ మునినారాయణప్ప, ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ అఖిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ



పి.యాలేరులో నిలిచిన మురుగు



మురుగుతో నిండిపోయిన కాలువ

- పట్టించుకోని పంచాయితీ అధికారులు
- అనారోగ్యానికి గురవుతున్న ప్రజలు

ఆత్మకూరు: మండలంలోని కొన్ని పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గ్రామాల్లోని పలుచోట్ల మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు సోకే అవకాశం లేకపోలేదు. దోమలు అధికం కావడంతో అనారోగ్యానికి గురవుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. కనీసం దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ కూడా చేయడం లేదని మండిపడుతున్నారు. నిత్యం పంచాయతీ అధికారులు వీటిని చూస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు మాత్రమే కాకుండా డయేరియా విజృంభిస్తోంది. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టి శుభ్రంగా ఉంచాలని పంచాయతీ అధికారులు, ఇటు వైద్య సిబ్బందికి జిల్లా స్థాయి అధికారులు సూచిస్తున్నా పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు అవగాహన సదస్సులు నిర్వహించడం లేదు. ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. మురుగు ఎక్కడ ఉంటే తమకేమి సంబంధం లేదు అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

అలా వస్తారు.. ఇలా వెళ్తారు..!

పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని జిల్లా ఉన్నత స్థాయి అధికారులు తెలియజేసినప్పటికి పంచాయితీ అధికారులు మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉన్నారు. కేవలం ఫ్లెక్సీలు పట్టుకుని ఫొటోలకు ఫోజులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. అపరిశుభ్రత నెలకొన్న ప్రదేశాల్లో కేవలం కొద్ది సేపు అలా బ్లీచింగ్ పౌడర్ ఫాగింగ్ చేసి వెళ్తున్నారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఏదైనా పని మీద పంచాయతీ కార్యాలయాలకు వెళ్తే ఉదయం 11 గంటలు దాటినా అధికారులు రావడం లేదని మండిపడుతున్నారు. కనీసం ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేయించాలని కోరుతున్నారు. పంచాయతీ అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆత్మహత్య చేసుకుంటున్నా..

- ఫేస్‌బుక్‌లో మెసేజ్ పెట్టి అదృశ్యమైన యువకుడు



జొన్నల పవన్ కుమార్

రాప్తాడురూరల్: తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని ఓ యువకుడు ఫేస్‌బుక్‌లో మెసేజ్ పెట్టి అదృశ్యమైన ఘటనపై అనంతపురం రూరల్ పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రూరల్ మండలం పాపంపేటకు చెందిన జొన్నల పవన్‌కుమార్ స్థానిక జొన్నా ఐరన్ మార్ట్ సమీపంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రూ. 80 లక్షల దాకా అప్పులు చేశాడు. తండ్రి రిటైర్డ్ పోస్ట్‌మాస్టర్ జొన్నల కంబయ్య చొరవ తీసుకుని రూ.76 లక్షల దాకా అప్పులు చెల్లించాడు. మరో నాలుగు లక్షల రూపాయలు మాత్రం అప్పులు ఉన్నాయి. మంగళవారం సాయంత్రం ఇంట్లో భార్యకు చెప్పి పవన్‌కుమార్ బయటకు వెళ్లాడు. కాసేపటికి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ ఫేస్‌బుక్‌లో మెసేజ్ పెట్టి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. ఫేస్‌బుక్ మెసేజ్ చూసిన కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై సమీప ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ లభించక పోవడంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి పవన్ కుమార్ కోసం గాలిస్తున్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో పూజలు

రాప్తాడు: స్థానిక నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలోని మూలవిరాట్‌కు అభిషేకాలు చేపట్టారు. పూజారి రమణ ముత్యాలమ్మ విగ్రహాన్ని విశేషంగా అలంకరించారు. పూజల్లో స్థానికులే కాకుండా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

అనంత వాసికి అరుదైన గౌరవం



నబీరసూల్

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన సీనియర్ కవి, సామాజిక సేవా కార్యకర్త కంబదూరు షేక్ నబీరసూల్‌కు అరుదైన గౌరవం దక్కింది. గత నలభై ఏళ్లగా సాహితీరంగంలో విశేష కృషి చేస్తున్న ఆయనకు ఐఎస్‌ఓ గుర్తింపు పొందిన మనం ఫౌండేషన్ వారు పద్మ ప్రతిభ–24 అవార్డు అందించనున్నారు. అలాగే ఈనెల 11న హైదరాబాద్‌లోని సారస్వత పరిషత్తులో జరిగే అవార్డుల ప్రదానోత్సవానికి విశిష్ట అతిథిగా ఎంపిక చేశారు. అనంత వాసికి అరుదైన గౌరవం దక్కడంపై కవులు మధురశ్రీ, నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, రియాజుద్దీన్, జూటూరు షరీఫ్ అభినందించారు.

ఫాగింగ్, స్ప్రేయింగ్ చేపట్టాలి

అనంతపురం కార్పొరేషన్: దోమకాటు నివారణ చర్యల్లో భాగంగా నగరంలో ఫాగింగ్, స్ప్రేయింగ్ కార్యక్రమాలను యథావిధిగా కొనసాగించాలని సంబంధిత సిబ్బందిని ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి ఆదేశించారు. మంగళవారం నగరంలోని వివిధ సర్కిళ్లలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు సైతం స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు. అనంతరం ప్లాస్టిక్ నియంత్రణకు సంబంధించి సచివాలయ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల తలెత్తే సమస్యలను ప్రజలకు వివరించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలన్నారు. ఆ దిశగా వ్యాపారుల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

నగరంలో పర్యటించిన ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మంగళవారం నగరంలో పర్యటించారు. మొదట వేణుగోపాల్ నగర్‌లో హై కోర్టు కంటెమ్ట్‌లో ఉన్న ఓ స్థలాన్ని (179/1) పరిశీలించారు. రోడ్డు వివాదం ఎన్ని రోజుల నుంచి నడుస్తోందని ఏసీపీ మారుతీ హరిప్రసాద్ తదితరులను అడిగి తెలుసుకున్నారు. గత కొన్నేళ్లుగా కోర్టులో ఈ వ్యవహారం నడుస్తోందని.. ప్రైవేట్ స్థల యజమానికి నష్టపరిహారం చెల్లించాలని కోర్టుకు వెళ్లినట్లు అధికారులు సమాధానం ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే సెంట్రల్ పార్క్‌ను పరిశీలించారు. నగరపాలక సంస్థకు చెందిన స్థలం ఎంత ఉంది? ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఏసీపీని ఆదేశించారు. అనంతరం నగరపాలక సంస్థకు ఫెన్సింగ్ వేయాలన్నారు. ఎమ్మెల్యే వెంట అదనపు కమిషనర్ శ్రీహరి బాబు, తదితరులు ఉన్నారు.

డీఎస్సీ కోచింగ్‌కు ఓసీలు అర్హులు కారా?

అనంతపురం ఎడ్యుకేషన్: బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ప్రభుత్వం అందించే డీఎస్సీ ఉచిత శిక్షణకు ఓసీలను దూరం చేయడం తగదని ఓసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి బుర్రా జయవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగబద్ధంగా ఓసీలకు కల్పించిన ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా అధికారులు కాలరాస్తున్నారని వాపోయారు. ఓసీల్లో ఆర్థికంగా వెనుకబడిన వారు ఉన్నారని గుర్తు చేశారు. అలాంటి వారు డీఎస్సీ కోచింగ్‌కు ప్రైవేట్‌గా వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా అన్ని వర్గాలకు ఉచితంగా కోచింగ్ ఇచ్చేందుకు దరఖాస్తులు తీసుకుంటున్నారని తెలిపారు. కేవలం ఓసీ అభ్యర్థుల దరఖాస్తులు మాత్రం తీసుకోవడం లేదన్నారు. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ ఉన్న ప్రతి ఓసీ అభ్యర్థికి ఉచితంగా కోచింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

నేడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

రాప్తాడు: అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల్లోని జన్మభూమి నగర్, కక్కలపల్లి, కాటిగాని కాల్వ, బుక్కచెర్ల, జి.కొత్తపల్లి, గాండ్లపర్తి, వరిమడుగు, పాలచెర్ల, భోగినేపల్లి, అయ్యవారిపల్లి గ్రామాల్లోని భారత్ గ్యాస్ వినియోగదారులకు బుధవారం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనున్నారు. ఈనెల 9వ తేదీ వరకూ ఇండేన్ గ్యాస్ బుక్ చేసుకున్న వారికి రాప్తాడులోని పాత ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వంట గ్యాస్ సిలిండర్లను అందజేయనున్నారు. మరింత సమాచారం కోసం 08554–286777 (భారత్ గ్యాస్), 9848482890 (ఇండేన్ గ్యాస్) సంప్రదించవచ్చు.